క్లుప్తంగా

సంక్షేమాన్ని అందజేసే వైఎస్సార్ సీపీని ఎన్నుకోండి



నరసరావుపేట: నిత్యం ప్రజల సంక్షేమం కాంక్షించే వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 22వ వార్డులో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అందజేసిన సంక్షేమంతో కూడిన కరపత్రాన్ని ఓటర్లకు అందజేసి మద్దతు తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఐబీసీ డైరక్టర్ కాకుమాను సదాశివరెడ్డి, నాయకులు పొలిమేర వెంకటరెడ్డి, బొబ్బిలి శ్రీలక్ష్మి, పూనూరి రమాదేవి, గోపిరెడ్డి రాధ తదితర మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ముదిరాజులు కృషి చేయాలి



ఈపూరు: వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ముదిరాజులు కృషి చేయాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన ఈపూరులో సోమ వారం జరిగిన ముదిరాజ్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీసీలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రాముఖ్యత ఇచ్చి ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వడమే కాకుండా విడదల రజనికి మంత్రి పదవి ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీగా అనిల్ కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాకరబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీవోలు, ఏపీవోలకు ఒకరోజు శిక్షణ



నాదెండ్ల: గణపవరం శ్రీకెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పీవోలు, ఏపీవోలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, తహసీల్దార్లు, ఏఈఆర్‌వోలు జ్వాలా నరసింహం, డీటీపీ వరకుమార్, అస్రిఫూన్ బేగం పాల్గొన్నారు. 11 తరగతి గదుల్లో 11 మంది అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ శిక్షణ ఇచ్చారు. మాస్టర్ ట్రైనర్లుగా కాట్రు శ్రీనివాసరావు, ఎల్ రాము, ఎంపీ సుభాని, ఎ.ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, వేదమణి, నాగమల్లేశ్వరరావు, భాస్కరరావు, జి.శ్రీనివాసరావు, మాధవరావులు ఉన్నారు. ముందుగా పీవోలు, ఏపీవోలకు బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం టీవీల సహాయంతో శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజన అనంతరం మాక్‌పోలింగ్‌పై శిక్షణ ఇచ్చి రాత పరీక్ష నిర్వహించారు.

‘కోడై’కూసినా వీరికి పట్టదు



టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్టీసీ డ్రైవర్ గడిపూడి సురేష్

వినుకొండ(నూజెండ్ల): ఎన్నికల కమిషన్ ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దంటూ ప్రచార నియమావళిని రూపొందించినప్పటికీ కొంతమంది ఉద్యోగులు పార్టీ కార్యకర్తల్లాగా నాయకుల వెంబడి ప్రచారంలో పాల్గొంటున్నారు. వినుకొండ ఆర్టీసీ డ్రైవర్ గడిపూడి సురేష్ తెలుగుదేశం పార్టీ చేరికల కార్యక్రమంలో పాల్గొనడం, వినుకొండ మునిపాలిటీలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాజా టీడీపీ ప్రచార కార్యక్రమంలో బహిరంగంగానే ర్యాలీలో తిరుగుతున్నాడు. దీనిపై ఎన్నికల అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



టీడీపీ ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజా

రైతుల సేవలో వేల్పూరు కోల్డ్ స్టోరేజ్

మాది రైతన్న ప్రభుత్వం అని గతంలో ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చేవి. కానీ జగనన్న పాలన అలా కాదు. రైతుల అవసరాలకు ఏం కావాలో వాటిని సమకూర్చింది. అందులో రైతుభరోసా కేంద్రాలు అగ్రస్థానంలో ఉంటూ సేవలందిస్తుండగా ఇప్పుడు వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలం వేల్పూరులోని శీతలగిడ్డంగి (కోల్డ్‌స్టోరేజీ) రైతులకు మరింత సేవలందిస్తూ ముందుకు సాగుతోంది. ఆరంభించిన మూడు మాసాలకే ఈ గిడ్డంగిని 80 శాతం వరకు రైతులు వినియోగించుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- జగనన్న పాలనలో సాకారమైన రైతన్న కల
- రైతులకు అందుబాటులోకి వచ్చిన శీతల గిడ్డంగి
- ఆరంభించిన కొద్దిమాసాలకే మంచి ఆదరణ
- 8 వేల క్వింటాల మిరప పంట నిల్వ
- మూడు నెలల వ్యవధిలో రూ.35 లక్షల ఆదాయం



వేల్పూరు కోల్డ్ స్టోరేజ్ (ఫైల్)



నిల్వ ఉంచేందుకు సిద్ధం చేసిన మిరప బస్తాలు

ఇది కదా.. అభివృద్ధి

శావల్యాపురం: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర రాక.. దళారుల మాయజాలం దాటికి అన్నదాతలు ఒకప్పుడు పడుతున్న కష్టాలను గుర్తించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన శీతల గిడ్డింగి (కోల్డ్‌స్టోరేజ్) కేంద్రంలో ప్రగతి పథంలో పయనించుతుండటంతో రైతు లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో శావల్యాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) వారి సారథ్యంలో నాబార్డు నిధు లు రూ. 6 కోట్లు వ్యయంతో శీతల గిడ్డంగి కేంద్రం జనవరి 3వ తేదీన ప్రారంభించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో అన్నదాతలు పడుతున్న కష్టాలను స్వయంగా పరిశీలించి సొసైటీ వారి ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్ ప్రారంభించి తక్కువ వ్యవధిలో 80 శాతం వరకు వివిధ రకాల పంటలతో నిండిపోయాయి. మిరప పంట ఒక్కో బస్తాకి ఆరు నెలల వ్యవధి వరకు రూ.190 రూపాయలు మాత్రమే చెల్లించాలి. అలాగే మెట్ట పంటలైన కంది శనగ తదితర వాటికి ఒక్కో సంవత్సరానికి క్వింటాకు రూ.170లు చెల్లించాల్సి ఉంటుంది.

11 కె.వి. విద్యుత్ సామర్థ్యం

ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్‌కు 11 కె.వి. విద్యుత్ సామర్థ్యం కల్గిన ప్రత్యేకంగా విద్యుత్ సౌకర్యంతో పాటు విద్యుత్ అంతరా యం సమయంలో ప్రత్యేకంగా జనరేటర్ కూడా ఏర్పాటు చేశారు. 7 డిగ్రీల ఉష్ణోగ్రత తీవ్రతలో పంటలు నిల్వ ఉంటాయి. ఇప్పటి వరకు 8 వేల క్వింటాల మిరప బస్తాలు నిల్వ ఉండగా 394 మంది రైతులు తమపేర్లు నమోదు చేసుకున్నా రు. నమోదు కాబడిన రైతులందరికీ సమగ్ర వివరాలతో కూడిన రశీదు, బాండ్లు రైతులకు అందజేశారు. ఏమైనా ప్రమాదం జరిగిన సమయంలో రైతులు నిల్వ ఉంచిన పంటలకు బీమా సౌకర్యం వర్తిస్తుంది. ఈ కోల్డ్ స్టోరేజ్‌లో వివిధ పంటల బస్తాలను లిఫ్ట్ మార్గంలో తరలించటంతో పాటు 15 మంది హమాలీలు నిరంతరం అందుబాటులో ఉండేలా సొసైటీ అధికారులు చర్యలు చేపట్టారు. వీరికి ప్రత్యేకంగా ఉండటానికి గదులు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. వినుకొండ, దొండపాడు, నాగిరెడ్డిపల్లె, బొగ్గరం, వెల్లటూరు, మూగచింతలపాలెం, చినకంచర్ల, పానకాలపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు మిరప పంటను ఈ శీతల గిడ్డంగిలో నిల్వ ఉంచారు.

రవాణా భారం తగ్గింది



రెండున్నర ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. 60 క్వింటాల మేర మిరప దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మిరప పంటకు గిట్టుబాటు ధర లేకపోవటం వలన నూతనంగా ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచేందుకు సరుకు తీసుకుని వచ్చా. దీని వల్ల రవాణా భారం తగ్గింది. దానికితోడు తక్కువ ఖర్చుతో పంట నిల్వ ఉంచేందుకు జగనన్న ప్రభుత్వం రైతులకు ఇలాంటి సేవలు చేయటం చాలా సంతోషంగా ఉంది.

– పురేటి వెంకట శ్రీనివాసరావు, రైతు, చినకంచర్ల

రైతులకు ఎంతో ఉపయుక్తం



ప్రారంభించి మూడు నెలల వ్యవధిలో రూ. 35 లక్షల ఆదాయం వచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో నూతన కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయటం వలన రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. గతంతో ఎంతో దూరం వెళ్లి పంట నిల్వ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు దగ్గరలోనే శీతల గిడ్డంగి ఏర్పాటు చేయడం వల్ల రైతుకు మేలు చేసినట్లయింది.

– నాగులపాటి చెన్నయ్య, శావల్యాపురం సొసైటీ చైర్మన్

జన్మభూమి రుణం ఇలా తీర్చుకున్నా



నా జన్మభూమి రుణం తీర్చుకోవటం దేవుడు ఇచ్చిన వరం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతులకు మెరుగైన సేవలు అందించటంతో పాటు రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్నదాతలకు నిరంతరం అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం జగనన్నదే. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. శీతల గిడ్డంగి రైతులకు సద్వినియోగం కావడం మహదానందంగా ఉంది.

– బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే, వినుకొండ

బొల్లా కుటుంబ సభ్యుల ఎన్నికల ప్రచారం



వినుకొండ(నూజెండ్ల): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుటుంబసభ్యులు పట్టణంలోని 2, 4,13, 21, 25 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన కుమార్తె మణికుమారి, కోడలు స్వప్న, ఇతర కుటుంబసభ్యులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని ప్రతిఒక్కరికి తెలియజేస్తూ, ఇలాంటి అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడును గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రొంపిచర్ల: మండలంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై రొంపిచర్ల సమీపంలో సోమ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఒంగోలు నుంచి కారంపూడి వైపు వెళ్తున్న కారు రొంపిచర్ల సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కె. అరవింద్, ఎస్. పవన్‌లకు స్వల్పగాయాలయ్యాయి. గాయాలైన వారిని వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీలోకి డాక్టర్ కొండపల్లి



పార్టీలోకి వస్తున్న డాక్టర్ కొండపల్లితో అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్, డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేటలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి



వినుకొండలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

- ఆహ్వానించిన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనీల్, డాక్టర్ గోపిరెడ్డి
- వినుకొండలోనూ కారుమంచికి చెందిన 20 కుటుంబాలు చేరిక

నరసరావుపేట: స్థానిక సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల మండలం జానపాడుకు చెందిన జనసేన నాయకులు ఎస్ఆర్‌ఐ చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి అశోక్ వైఎస్సార్‌సీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. సోమవారం రావిపాడు రోడ్డులోని కొండపల్లి స్వగృహంలో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వారిని కలిసి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, వీరు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో అధికారికంగా పార్టీలో చేరనున్నట్లు డాక్టర్ కొండపల్లి సాక్షికి వెల్లడించారు. 2014 ఎన్నికల్లో డాక్టర్ కొండపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరసరావుపేట పార్లమెంటు స్థానానికి పోటీచేశారు. పట్టణంలో చిన్న పిల్లల వైద్యులుగా పేరుగాంచిన డాక్టర్ కొండపల్లి గత 30 ఏళ్లగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. కొంతకాలం టీడీపీలో కూడా కొనసాగారు. వీరి సేవలను తమ పార్టీ వినియోగించుకుంటుందని అభ్యర్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పమిడిపాడు వాసులు చేరిక

గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి చూసి టీడీపీకి చెందిన వ్యక్తులు వైఎస్సార్ సీపీలో చేరటం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పమిడిపాడు గ్రామానికి చెందిన వడియరాజుల కుటుంబాలకు చెందిన 30 మంది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యాలయంలో వీరందరికీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో వీరు నిర్లక్ష్యానికి గురవుతుండగా తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీరు నివాసం ఉండే ప్రాంతంలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యత, పార్లమెంటు సభ్యునిగా బీసీ అభ్యర్థి డాక్టర్ అనీల్‌కుమార్ యాదవ్ ఎంపిక చేయటాన్ని చూసి వీరందరూ తమ పార్టీలో చేరారన్నారు. జరగబోయే ఎన్నికల్లో వీరందరూ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషిచేయాలని కోరారు. రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, పట్టణ కన్వీనర్ ఎస్.ఏ.హనీఫ్, గ్రామ పెద్దలు కొప్పరపు బాబు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, జగనన్న హయాంలో పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికీ మేలు జరిగిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాబు బూటకపు హామీలు నమ్మవద్దు

- విశ్వసనీయతకు పట్టం కట్టండి
- ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



ఎన్నికల ప్రచారంలో కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: బాబువి బూటకపు హామీలని... గతంలో 650 హామీలు ఇచ్చి హామీలనే మాఫీ చేసిన ఘనుడని, ఆయన మాటలు నమ్మవద్దని... విశ్వసనీయత కలిగిన వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని 37వ వార్డులో ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. మహిళలు హారతులిచ్చి, పూలదండలు వేసి, శాలువాలతో సత్కరిస్తూ ఘన స్వాగతం పలికారు. కావటి ఇంటింటికీ తిరిగి ఐదేళ్ల ప్రజారంజక పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్న సారథ్యంలోని వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరారు. 2014లో ఇచ్చిన హామీలను ఎగవేసిన దొంగల ముఠా కూటమికి ఓటు వేయవద్దని విమర్శించారు. రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు కూటమి కట్టారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జతకట్టినా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని చెప్పారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సిఫార్సులతో మాత్రమే పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. అదే వైఎస్సార్ సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడంతో, నవరత్న పథకాల వల్ల పేదల జీవితాలు బాగుపడ్డాయని తెలిపారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు తేడా గమనించాలని కోరారు. అభివృద్ధి సంక్షేమ పథకాలలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్‌ను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 37వ వార్డు పార్టీ ఇన్‌చార్జి అశోక్, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ఏపీఎం సుభాని,నాయకులు కామేశ్వరరావు, తమ్మవరపు సత్యనారాయణ, తోట ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, కౌన్సిలర్లు షేక్ మీరావలి, అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, ములకలూరి బాజిమున్ని, షేక్ యూసఫ్ అలి, కొచ్చెర్ల విజయలక్ష్మి, కె. రమణీబాయి తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

పట్టణంలోని 29వ వార్డు పరిధిలోని సుభాని నగర్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌తో కలసి 8,20,21,22 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

మూడుపార్టీల కూటమిని ఘోరంగా ఓడించాలి

- వైఎస్సార్ సీపీకి ఎంఐఎం మద్దతు సంతోషకరం
- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డితో ఎం.ఐ.ఎం నాయకులు

నరసరావుపేట: ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని కాంక్షించే వైఎస్సార్‌సీపీ పార్టీకి ఎం.ఐ.ఎం మద్దతు తెలియచేసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని వచ్చే ఎన్నికల్లో ఘోరంగా ఓడించాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు ఇచ్చారు. సోమవారం సాయంత్రం ప్రకాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎంఐఎం నాయకులు డాక్టర్ గోపిరెడ్డిని కలిసి తమ మద్దతు తెలియచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎం.ఐ.ఎం నాయకుడు సలావుద్దీన్ ఓవైసీ, అసదుద్దీన్ ఓవైసీలు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మద్దతు ప్రకటించారన్నారు. ఇప్పుడు ఇక్కడి నాయకులు గత ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న తమకు మద్దతు తెలియచేశారన్నారు. టీడీపీకి ఓటువేస్తే బీజేపీకి ఓటువేసినట్లుగానే ముస్లిం సోదరులు భావించాలన్నారు. సీఏఏ లాంటి చట్టాన్ని తీసుకొచ్చి ముస్లింలను ఇబ్బందిపెట్టాలనే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందన్నారు. ఇటువంటి పార్టీలు అధికారంలోకి రాకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ముస్లింలపై ఉందన్నారు. ఎంఐఎం జిల్లా కార్యదర్శి షేక్ కరిముల్లా మాట్లాడుతూ జనాబ్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశానుసారం స్థానిక వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించామన్నారు. అరవింద బాబు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడుతూ 2019లో మద్దతు ఇచ్చిన విధంగానే ఈసారి ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీతో కలిసి హిందువు, ముస్లింల మధ్య వైషమ్యాలు కల్పించేందుకు కుట్ర పన్నారన్నారు. వీరికి బుద్ధి చెప్పేందుకు ముస్లిం సోదరులు సిద్ధంగా ఉండాలని కోరారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవా లలో భాగంగా సోమవారం ఫైర్ స్టేషన్ సిబ్బంది అగ్ని ప్రమాద నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై ముద్రించిన కరపత్రాలను జన సమ్మర్ధం అధికంగా ఉన్న బస్టాండ్, రైల్వే స్టేషన్, పట్టణ ప్రధాన కూడళ్లలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ సుబ్బారావు మాట్లాడుతూ, వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశమున్నందున తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం భారీ సంపద ఆవిరైపోయేందుకు కారణమవుతుందనీ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ జమ్ముల శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ ఎ.శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండ టౌన్: గృహిణులు వంట చేసే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు భయాందోళనలకు గురికాకుండా, తగు మెలకువలు పాటించి అగ్ని ప్రమాదాలను అరికట్ట వచ్చునని స్టేషన్ ఆఫీసర్ బి. నాగేశ్వరరావు తెలియచేశారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని స్లమ్ ఏరియాలలో నివాసం ఉంటున్న మహిళలకు, అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ మాల్, ఆర్టీసీ గ్యారేజీ సిబ్బందికి ఫైర్ ఎక్టింగ్ విషర్స్ సహాయంతో, అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా తెలియచేశారు.లీడింగ్ ఫైర్ మెన్‌లు డి. ప్రకాష్‌రావు, ఎం. శ్రీనివాసరావు, ఆపరేటర్లు రమణారెడ్డి, రవికుమార్, ఫైర్ మెన్‌లు కేశవబాబు, ప్రభాకర్ రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లిఖార్జునరావు, హోంగార్డులు భాషఖాన్, రామకృష్ణారావు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు
- యడ్లపాడు మండలంలో అభ్యర్థుల పర్యటన



పర్యటిస్తున్న ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌నాయుడు

యడ్లపాడు: వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు సోమవారం రాత్రి యడ్లపాడు మండలంలోని మూడు గ్రామాల్లో పర్యటించారు. కార్యకర్తల బైక్‌ర్యాలీ, అభ్యర్థుల రోడ్‌షోలతో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఒక్క ఊరిని వదలకుండా నాయకులు చుట్టేస్తున్నారు. ప్రతి పల్లెలోనూ ప్రచారానికి విశేష స్పందన లభించింది. మహిళల హారతులిచ్చి.. పార్టీశ్రేణులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పుతూ ఘనస్వాగతం పలికారు. ముందుగా పార్టీ శ్రేణులతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చర్చిల్లో ప్రార్థనలు, గుళ్లల్లో పూజలు చేశారు. అనంతరం ప్రచారరథంపై ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్‌షో నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకం అవుతూ తమ సందేశాన్ని వినిపిస్తున్నారు. మంచి చేసిన నాయకులను మళ్లీ గెలిపించాలని కోరుతున్నారు. తిమ్మాపురం, లింగారావుపాలెం గ్రామాల్లో పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల కాలంలో ప్రజలకు జరిగిన సంక్షేమం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతిమలక్ష్యం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే అంటూ దిశానిర్దేశం చేశారు. కారుచోల గ్రామంలోనూ ప్రచార రథంపై ఉండి రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కూడళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఆయా వివరాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు ఘంటా శంకర్, ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్, జేసీఎస్ కన్వీనర్ ఆర్ చింతారావు, సర్పంచ్‌లు షేక్ కరీమూన్, నారాయణమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం వీరారెడ్డి, నాయకులు మానుకొండ విజయభాస్కరరెడ్డి, పావులూరి వాసు, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, రావూరి రామారావు, నాగండ్ల సాంబయ్య, పెద్ది ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి, సుభాష్, గౌరు రాజేష్, షేక్ సుభాని, కర్నాటి సుబ్బారావు, చాగంటి శ్రీధర్, సొసైటీ డైరెక్టర్ ఉదయ్ కిరణ్, రెహమాన్ ముగ్దుం, వైఎస్ కరీమముల్లా, బీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నాటక రంగ దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో ఈనెల 16వ తేదీ మంగళవారం సాయంత్రం తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి సోమవారం తెలిపారు. శ్రీనాథ సాహితీ పరిషత్, సత్తెనపల్లికి చెందిన పి.సత్యనారాయణరాజు కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భూసూరపల్లి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని సాహిత్యంలో నాటక రంగ ప్రాధాన్యత అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా నాటక రంగానికి తమ సేవలు అందించిన కళాకారులు, నటులను సన్మానించనున్నట్టు పేర్కొన్నారు. కళాభిమానులు, కవులు, కళాకారులు సాహితీవేత్తలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.